పేదలకు మేలు చేయడమే 'సురక్ష' లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్


పాల్గొన్న కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు

- వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: పేదలకు మేలు చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నారు. అందుకు అవసరమైన డాక్యుమెంట్లు వారి నుంచి సేకరించి సచివాలయాలకు అందించాలని సూచించారు. ఇప్పటి వరకు 90 శాతం మంది అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. మిగిలిన వారికి కూడా అందే విధంగా చూడాలని తెలిపారు. వలంటీర్లు, గృహ సారథులతో సహా నాయకులు కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల జారీ చేసే విధానంలో ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పారదర్శకంగా చేయాలన్నారు. సచివాలయం పరిధిలో సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ప్రజలకు సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. వార్డుల్లో లోటుపాట్లు, సమస్యలు సమావేశంలో చర్చించవచ్చునని తెలిపారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు రవాణా సహకారం అందివ్వాలని తెలిపారు. అందుకోసం దూరాన్ని బట్టి ఆటోలు ఏర్పాటు చేయాలన్నారు. పశ్చిమ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రహమాన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమని వివరించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

- భారీగా తరలివెళ్లిన యాదవ సామాజిక వర్గ ప్రజలు
- కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు


కత్తి సాము చేస్తున్న యువత


పూజలందుకున్న మరిడిమాంబ అమ్మవారు

మల్కాపురం: మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పండగను గ్రామంలోని యాదవ సామాజిక వర్గం ప్రజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు,యువత,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదవ సంఘం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు,కుంకుమలు,కానుకలు,సారెతో మరిడిమాంబ అమ్మవారి ఆలయం వరకు తరలివెళ్లారు.అక్కడ అమ్మవారి దర్శించుకుని కానుకలు సమర్పించారు.ఈ సందర్భంగా యాదవ యువత చేసిన సాముగరిడీ,సేవ గరడీ,కత్తి సాము ప్రదర్శన ఆకట్టుకున్నాయి. 1998 నుంచి గ్రామంలోని పలు సామాజిక వర్గం ప్రజలు ప్రతి ఏటా జూన్,జూలై మాసాల్లో అమ్మవారి పండగ చేస్తున్నారు.గ్రామంలోని 16 కులాల ప్రజలు వారి వారి సామాజిక వర్గం ప్రజలతో ఒక ఆదివారం పండగ చేస్తారు.కోవిడ్ ఫస్టు,సెకెండ్ వేవ్ సమయంలో మినహా ఏటా అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు.

పుర్రె సురేష్‌కు పలువురి అభినందన


ఆడారి ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా సంప్రదింపులు జరిపే బాధ్యతను వైఎస్సార్‌సీపీ 59వ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్‌కు అప్పగించారు. ఈ మేరకు ఏపీ సూక్ష్మ చిన్న , మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్,పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం పుర్రె సురేష్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి అధికారికంగా 40,58,59,60,61,62,63వ వార్డుల పరిధిలోని నిరుద్యోగులకు హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) అధికారులతో మాట్లాడి వివిధ ట్రేడ్‌లలో ఉపాధి కల్పించే బాధ్యత సురేష్‌యాదవ్‌కు అప్పగించారు. ఏడు వార్డుల పరిధిలో అర్హులైన నిరుద్యోగులను ఆయన సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ల వద్దకు తీసుకు వెళ్లి వారికి ఉపాధి కల్పించే విధంగా చూస్తారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్,కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు,పలు వార్డుల కార్పొరేటర్లు గులివిందల లావణ్య,ముర్రు వాణి, బల్లా లక్ష్మణరావు,కొణతాల సుధ,ట్రేడ్ యూనియన్ నాయకుడు బద్రీనాథ్, కొల్లి నూకరెడ్డి,మళ్ల ధనలత, గులిగిందల కృష్ణ,పిలక రామ్మోహన్ రెడ్డి,నరేష్,భీశెట్టి గణేష్,రేవళ్ల సత్యనారాయణ తదితరులు పుర్రె సురేష్‌కు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

29న పెద్దింటమ్మ పండగ

మల్కాపురం: మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక రామాలయం వద్ద జరిగిన సమావేశంలో గ్రామ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు భోగవల్లి నాగభూషణం,అధ్యక్షుడు సత్యాల మహేష్,ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావుయాదవ్ తదితరులు గ్రామ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే ఈ నెల 29న పెద్దింటమ్మ వారి పండగను వైభవంగా జరపాలని నిర్ణయించారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో పాలకులు,పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురం గణేష్ మందిరం ఎదురుగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గైనికాలజిస్ట్ డాక్టర్ పి.ఉషారాణి, చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ సుధీర్ పలు అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. ప్రాణ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు స్త్రీలకు సంబంధించిన పలు అనారోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.

2న నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- గిరి ప్రదక్షిణ సందర్భంగా మళ్లింపు

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలి నడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎన్ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎస్.వి.ఎస్.ప్రసాద్, ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


శాంతమ్మ (ఫైల్)

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 87వ వార్డు కణితి అంబేడ్కర్ కాలనీ ప్రాంతానికి చెందిన పొట్నూరు శాంతమ్మ(63) ఈ నెల 22వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి, మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శాంతమ్మ కోడలు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- రౌడీ షీటర్లకు సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

గోపాలపట్నం: రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డి. ప్రసాద్ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పాత నేరస్తులను గుర్తించి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. వారిలో మంచి మార్పు కోసం ప్రతీ ఆదివారం కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. నేరాలకు పాల్పడినట్లు గుర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

వజ్ర వారాహిదేవికి సహస్ర చామంతి పుష్పార్చన


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉక్కునగరం: వారాహి నవరాత్రి మహోత్సవాలు స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాడ శుద్ధ దశమి వరకు నిర్వహిస్తున్న పూజల్లో భాగంగా ఆదివారం శ్రీ మహాదుర్గ అమ్మవారిని వజ్ర వారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర చామంతి పుష్పార్చన చేశారు. ప్రజలకు ఆరోగ్యం, పరాక్రమం కలిగేలా చూడాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు తెలుగుదేశంకాలనీలో పునర్నిర్మించిన కొండదేవతమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు.

ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మురళీనగర్: చెవి, ముక్కు, గొంతు చాలా వ్యాధులకు ముఖద్వారాలు లాంటివని, వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ దిలీప్ దుంగల అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ప్రాంగణంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. చెవిలో గులుమును శుభ్రపరిచేందుకు వివిధ రకాలైన ఇయర్ బడ్స్ వాడడం మంచిది కాదన్నారు. చెవి దురద ఉపశమనానికి ఇయర్ బడ్స్ వాడటం, చెవిలో నూనెలు వేయడం చేయరాదని చెప్పారు. చెవిలో నాడి వచ్చినప్పుడు ఇన్‌ఫెక్షన్ ఉన్నట్టు నిర్ధారించుకుని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సీహెచ్ వరప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 148 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ దిలీప్, డాక్టర్ వరప్రసాద్‌లను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించి జ్ఞాపికలను అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగించవద్దని ఆందోళన


దుకాణాల వద్ద ఆందోళన చేస్తున్న దుకాణదారులు, స్థానికులు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకుని తాటిపూడి పైప్‌లైన్ స్థలంలో దుకాణాలు తొలగించవద్దని దుకాణదారులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. గోపాలపట్నం బెహరా ఆస్పత్రి నుంచి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు ఉన్న సుమారు 20కి పైగా దుకాణాలు తొలగించాలని జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు మౌఖిక ఆదేశాలు ఇచ్చారని వాపోయారు. దుకాణాలు ఖాళీ చేసేందుకు 26 వరకు గడువు ఇచ్చారన్నారు. గతంలో రోడ్డు విస్తరణతో పాటు పైప్‌లైన్‌కు తమ స్థలాలు ఇచ్చామని దుకాణదారులు పేర్కొన్నారు. ఇక్కడ 40 ఏళ్లుగా ఉంటున్నామని తెలిపారు. ఈ దుకాణాల వెనుక ఉన్న ఖాళీ స్థలంలో బహుళ అంతస్తులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, వారి కోసమే అధికారులు తమ దుకాణాలు తొలగించేందుకు యత్నిస్తున్నారని వాపోయారు. గతంలో పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నామని అందుకోసం ప్రభుత్వానికి డీడీలు చెల్లించామని చెబుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కార్యక్రమంలలో దుకాణదారులు వి.లక్ష్మి యాదవ్, డి సురేష్,పి. శ్రీనివాస్, డి. వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 864వ రోజుకు ఉక్కు రిలే నిరాహార దీక్షలు


దీక్షలో పాల్గొన్న నడుపూరు గ్రామ ప్రజలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 864వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో నడుపూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తోందన్నారు. నిర్వాసితులకు ఇప్పటికీ సరైన న్యాయం చేయలేదని, ప్లాంట్‌లో ఉపాధి కోసం సుమారు 15 వేల మంది నేటికీ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, గంగరావు, గంధం శ్రీనివాస్, ఆదినారాయణ, ఎస్.రామారావు, అయోధ్య రామ్, మంత్రి శంకర్‌నారాయణ, నడుపూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో బేడా ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

ప్రకృతితో ప్రయాణం


నీటిలో పెరిగే మొక్కలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రకృతి ప్రియులు


సీతాకోక చిలుకగా మారుతున్న గొంగలి పురుగు

- జీవవైవిధ్య ఉద్యానవనంలో విజ్ఞాన యాత్ర
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రకృతి ప్రేమికులు


పార్క్ విశేషాలను వివరిస్తున్న నిర్వాహకుడు రామమూర్తి

ఏయూ క్యాంపస్: ఉషోదయం వేళ ప్రకృతితో మమేకయ్యారు. వేలాది మొక్కల నడుమ నడక సాగించారు. ఈ విజ్ఞాన యాత్రకు వేదికగా నిలిచింది రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం. ఆదివారం ఉదయం ఏపీ అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా ఉషోదయపు ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర సుమారు మూడు గంటల పాటు సాగింది. నగరంలోని విభిన్న రంగాల్లో స్థిరపడిన అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జురాసిక్ కాలం నాటి మొక్కల విశేషాలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథ రామమూర్తి, మంగతాయి దంపతులు వివరించారు. అనంతరం ఔషధ వనం, ఎడారి మొక్కలు, నీటిలో జీవించే మొక్కలు, అరుదైన రుద్రాక్ష చెట్టు, కృష్ణుడి వెన్న గిన్నె, సీతమ్మవారి జడ, ఆశోక వృక్షం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతీ చెట్టు, మొక్క సమాచారాన్ని తెలియజేస్తూ వాటిలోని ఔషధ విలువలు, వివరాలు వివరించారు. కీటకాలను తినే మొక్కలు, అరుదైన ఆర్కిడ్‌లు, విభిన్న రకాల పామ్ ట్రీలను తిలకించి సంబరపడ్డారు. గొంగలి పురుగు సీతాకోక చిలుకగా మారే ప్రక్రియను ఇక్కడ ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు అచ్చెరువొందారు. అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వేలాది మొక్కలను పార్క్‌లో సంరక్షిస్తూ, విద్యార్థులకు ఒక జ్ఞాన కేంద్రంగా దీనిని నిలుపుతున్నట్లు నిర్వాహకులు రామమూర్తి తెలిపారు. యువత డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని పార్క్ నిర్వహణ, సంరక్షణలో భాగం కావాలని కోరారు.

విస్తృత ప్రచారం అవసరం



మొక్కలంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్క్‌ను తరచూ సందర్శిస్తుంటాను. ఇక్కడ ఉన్న వైవిధ్యమైన మొక్కలు మరెక్కడా చూలలేం. దీనికి విస్తృత ప్రచారం అవసరం. కృత్రిమ, అనుకూల పరిస్థితులను కల్పించి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొక్కలను పెంచుతున్న నిర్వాహకులకు అభినందనలు.

– ఆర్.నిహారిక, ఉద్యోగి

తెలుసుకుని వచ్చాను



విశాఖపట్నంలో ఇటువంటి పార్క్ ఉందని తెలియడంతో చూడాలని వచ్చాను. నేను ఉంట్లో కూడా అనేక రకాల మొక్కలు పెంచుతుంటాను. మొక్కల పెంపకం, సంరక్షించడం, వాటి ప్రత్యేకతలు ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను.

– ఎం.సాయి ప్రణతి

'గంగవరం' కార్మికులకు వేతన ఒప్పందం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: గంగవరం పోర్టు కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్ర కేసరి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి శాశ్వత ఉద్యోగం, వేతనాలు ఇస్తామని చెప్పారన్నారు. ఏళ్లు గడిచినా వారికి మంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పోర్టులో పోలీసు మాజీ అధికారులను నింపడంతో అక్కడ పోలీసు పెత్తనం, బెదిరింపులు పెరుగుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ మాట్లాడుతూ పోర్టులో 14 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ఇప్పటికీ బేసిక్ 3,700 రూపాయలు కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.ఎం. శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.